క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ములుగు రూరల్: విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ సాయికృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాశిందేవిపేట సబ్ స్టేషన్ పరిధి సర్వాపూర్ ఫీడర్, ములుగు, పత్తిపల్లి సబ్ స్టేషన్ పరిధి పత్తిపల్లి ఫీడర్ నేడు(శుక్రవారం) మరమ్మతుల కారణంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం కలుగుతుందని అన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వృద్ధుడి అదృశ్యం


సురేశ్

కాటారం: మండలంలోని బయ్యారం గ్రామానికి చెందిన సురేశ్ అనే వృద్ధుడు అదృశ్యమైన ఘనటపై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. ఈ నెల 1న ఇంటి నుంచి బయటకు వెళ్లిపోగా బంధువులు, తెలిసిన వారి వద్ద ఆరా తీసినప్పటికీ ఆచూకి లభించలేదని దీంతో సురేశ్ కూతురు ఐత సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సురేశ్ ఛామన చాయ కలిగి ఐదు ఫీట్ల ఎత్తు ఉంటాడని అతను ఇంటి నుంచి వెళ్లిపోయే సమయంలో రెడ్ కలర్ షర్ట్, పసుపు రంగు టీషర్టు, ధరించి ఉన్నట్లు తెలిపారు. ఆచూకి తెలిసిన వారు 87126 58139, 87126 58117 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

ఆర్థిక సాయం

వెంకటాపురం(ఎం) / ములుగు రూరల్ : మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన రాజేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులను గురువారం రాష్ట్ర మంత్రి సీతక్క పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా ములుగు మండలంలోని పత్తిపల్లి గ్రామానికి చెందిన దాసరి కట్టయ్య, బుర్రి ఐలయ్యలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను సీతక్క పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు.

ఒకరికి గాయాలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం నాగేపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ అనే యువకుడు మహారాష్ట్ర సిరొంచ పరిధిలోని చింతలపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. రాజశేఖర్ గురువారం సిరొంచ నుంచి నాగేపల్లికి తిరుగు ప్రయాణం అవుతుండగా బైక్ అదుపు తప్పి పడిపోగా కాలుకు తీవ్రగాయం అయింది. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సైబర్ క్రైంపై అప్రమత్తంగా ఉండాలి

ఏటూరునాగారం: సైబర్‌నేరాలు, ఆన్‌లైన్ డబ్బు చలామణి విషయంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏటూరునాగారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మండల రాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెల్‌ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనుచితుల నుంచి ఫైల్స్ డౌన్‌లోడ్ చేయవద్దని తెలిపారు. బ్యాంక్ పేరు మీద గ్రూప్ క్రియేట్ చేసి మీకు రీవార్డు వచ్చాయని ఏపీకే ఫైల్ డౌన్లోడ్ చేయమని రూ.10వేలు వస్తాయని మేసేజ్ పంపిస్తారని తెలిపారు. ఎట్టి పరిస్థితిల్లో అలాంటివి డౌన్‌లోడ్ చేసుకోవద్దని తెలిపారు. ఫైల్స్ డౌన్‌లోడ్ చేసి ఇటీవల కన్నాయిగూడెం మండలంలో ఒకరు డబ్బులు పోగొట్టుకున్నారని తెలిపారు.

కేసు నమోదు

వాజేడు : మండలంలోని అయ్యవారిపేట నుంచి అధిక లోడుతో వస్తున్న ఇసుక లారీపై కేసు నమోదు చేసినట్లు పేరూరు ఎస్సై రమేశ్ తెలిపారు. క్వారీ నుంచి నిర్ణీత లోడు కంటే సుమారుగా నాలుగైదు టన్నుల ఇసుకను అధికంగా లోడ్ చేసుకుని వస్తున్నట్లు తెలిపారు.వాహనాల తనిఖీల్లో భాగంగా అధిక లోడు ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేసి వాజేడు స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

చెట్టే బస్ షెల్టర్!

- రేగొండలో నిలువ నీడ కరువు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని పాలకులు


చెట్టు నీడలో బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు(ఫైల్)

రేగొండ: రేగొండ మండల కేంద్రంలో ఉన్న దుర్శన్ చెట్టే ప్రయాణికులకు బస్‌షెల్టర్‌గా నీడనిస్తుంది. పరకాల-భూపాలపల్లి ప్రధాన రోడ్డుపై ఉన్న రేగొండలో ఇప్పటి వరకు ప్రయాణికులకు నీడను కల్పించే ఆలోచన పాలకులకు రాకపోవడం విడ్డూరంగా ఉంది. మండలంలోని 37 గ్రామ పంచాయతీల నుంచి ప్రజలు వ్యాపార, అధికార కార్యాలయాలకు, వ్యక్తిగత పనులనిమిత్తం మండల కేంద్రానికి వస్తూ పోతుంటారు. అలాగే మండల కేంద్రం నుంచి నిత్యం పరకాల, హనుమకొండ, హైదరాబాద్, భూపాలపల్లి, కాళేశ్వరం, ములుగు, చిట్యాల, టేకుమట్ల వంటి పట్టణాలకు కేంద్ర బిందువుగా ఉన్న రేగొండ మండల కేంద్రం నుంచి నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. అలా ఎన్నో పట్టణాలకు అనుసంధానంగా ఉన్న మండల కేంద్రంలో ఇప్పటి వరకు బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండాకాలం, చలి కాలం చెట్టు కింద ఉన్న కూడా ముఖ్యంగా వర్షా కాలంలో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత ప్రభుత్వంలో మండల కేంద్రంలో బస్‌షెల్టర్ నిర్మించేందుకు పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న 20 గుంటల భూమిని గుర్తించి తహసీల్దార్, కలెక్టర్ అనుమతి తీసుకుని ఆర్టీసీ అధికారులకు అప్పగించిన ఇప్పటి వరకు ఎలాంటి పనులు కొనసాగలేదు. ఇప్పటికైనా అధికారులు, ఎమ్మెల్యే స్పందించి బస్ షెల్టర్ సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రజాప్రతినిధులు స్పందించాలి



ప్రజాసమస్యలపై పట్టింపు లేని పాలకుల వల్లే దశాబ్దాలుగా మండల కేంద్రంలో బస్‌షెల్టర్ నిర్మాణం జరగలేదు. నిత్యం వేల సంఖ్యలో ప్రజలు మండల కేంద్రానికి వస్తుంటారు. పిల్లలు, మహిళలు, వృద్ధులు బస్సు కోసం ఎండలో దుకాణాల ఎదుట వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. పాలకులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

\- పెండ్యాల రాజు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత


కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే గండ్ర

శాయంపేట : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని గాంధీ చౌక్ సర్కిల్‌లో షిర్డీ సాయిబాబా సత్సంగ్ మందిర్ నిర్మాణానికి గురువారం చేపట్టిన భూమిపూజ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మత్స్యగిరి స్వామి ఆలయాన్ని సందర్శించగా ఆలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించారు. దేవాలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ రవి, ఉపాధ్యక్షులు రమేష్, ప్రధానకార్యదర్శి వేణు, సంయుక్త కార్యదర్శి రవీందర్, కోశాధికారి ప్రకాశ్, ఎంపీటీసీ చంద్రప్రకాశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, నాయకులు శాంతరవి, మార్కండేయ, రవీందర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరిస్తా..

మండల కేంద్రంలో నిర్మిస్తున్న షిర్డీ సాయిబాబా సత్సంగ్ మందిర నిర్మాణానికి సాయం అందిస్తానని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. గురువారం జరిగిన భూమిపూజ కార్యక్రమానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, మాజీ సర్పంచ్ కందగట్ల రవి, పీఏసీఎస్ డైరెక్టర్ రమేష్, హైకోర్టు న్యాయవాది రూపేందర్, నాయకులు రమణారెడ్డి, నిమ్మల మహేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వీల్ చైర్స్ పంపిణీ


వీల్ చైర్ అందజేస్తున్న డీడబ్ల్యూఓ స్వర్ణలత

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో చేయూత స్వచ్ఛంద సేవా సస్థ ఆధ్వర్యంలో దాత వినోద్ సహకారంతో గురువారం వీల్ చైర్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని వీరభద్రవరం గ్రామానికి చెందిన పాయం తనూజ, ఐలాల మెర్సిలకు డీడబ్ల్యూఓ స్వర్ణలత చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ శిరీష, ఏసీడీపీఓ ముత్తమ్మ, సూపర్‌వైజర్లు చంద్రకళ, చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్, చిడెం సాయితేజ , వంశీకృష్ణ, రంజిత్ కుమార్, రాము, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిబ్బంది

మల్హర్: మండలంలోని మల్లారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ సిబ్బంది చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ సుమలత, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘ప్రేరణ’పై విద్యార్థులకు శిక్షణ


అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం భాస్కర్‌రావు

మంగపేట: మండలంలోని రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలోని తొమ్మిదోవ తరగతి విద్యార్థులకు పీఎంశ్రీ(ప్రధానమంత్రి వికసిత్ పాఠశాల) కేంద్ర ప్రభుత్వ అమోదిత ప్రేరణ కార్యక్రమంపై హెచ్‌ఎం భాస్కర్‌రావు ఆధ్వర్యంలో గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కథలు, రచనలు, వ్యాసరచన పోటీలు విద్యార్థులకు సర్వతోముఖాభివృద్ధికి దోహద పడుతాయన్నారు.దేశంలో గ్రామీణ పాఠశాలల్లోని విద్యార్థులకు అన్ని రంగాల్లో ప్రపంచ స్థాయి విద్యను అందించాల్సిన అవసరాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి గైడ్ టీచర్లుగా ఉపాధ్యాయులు పాయం వీరనారాయణ, జమున వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బానోతు బాలాజి, రాజ్యలక్ష్మి పఠాన్ ఆస్మా, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

‘ఆర్‌ఎస్‌ఎస్‌ను విమర్శించడం సరికాదు’


మాట్లాడుతున్న బలరాం

ములుగు రూరల్: జాతీయ బావ సిద్ధాంతం కలిగిన ఆర్‌ఎస్‌ఎస్‌ను రాష్ట్ర మంత్రి సీతక్క విమర్శించడం సరికాదని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గాదం కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ జెండా అంటే బీజేపీకి తెలియదని మంత్రి సీతక్క హేళన చేయడం సబబుకాదని అన్నారు. పాక్ అక్రమిత కాశ్మీర్‌లోని లాల్ చౌక్‌లో మొట్టమొదటి సారి జాతీయ జెండా ఎగరవేసిన ఘనత బీజేపీకి దక్కుతుందని అన్నారు. దేశంలో జాతి పునర్నిర్మాణం కోసం పని చేసే ఏకైక సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ అని అన్నారు. నక్సల్ పార్టీ బావజాలం కలిగిన సీతక్క ఆర్‌ఎస్‌ఎస్ సంస్థను విమర్శించడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, గిరిజన మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, శోభన్, యాదగిరి, రవిరెడ్డి, రాజ్‌కుమార్, సంతోష్, హరీష్‌గౌడ్, భూక్య దేవ్‌సింగ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

108, 102 సర్వీస్‌లపై అవగాహన


ఆశవర్కర్లకు వివరిస్తున్న వైద్యాధికారులు

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మండల వైద్యాధికారి నాగరాణి ఆధ్వర్యంలో ఏఎన్‌ఎమ్‌లకు, ఆశాలకు 108, 102 సర్వీస్‌లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ మెరుగు నరేష్, హెల్త్ అసిస్టెంట్ భిక్షపతి,108 స్టాఫ్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, పైలట్ విజేందర్, వైద్యాసిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి


వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచులు

రేగొండ: గ్రామ పంచాయతీల్లో తాము చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలోని మాజీ సర్పంచులు కలెక్టర్ భవేశ్‌మిశ్రాకు వినతిపత్రం అందజేశారు. గురువారం సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు దాసరి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో మాజీ సర్పంచులు కలెక్టర్, డీపీఓకు వినతిపత్రం అందజేసి మాట్లాడుతూ.. 2019 ఫిబ్రవరి 2 నుంచి సర్పంచ్‌లుగా బాధ్యతలు చేపట్టిన తాము గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు, నర్సరీల ఏర్పాటు, వైకుంఠదామం నిర్మాణం, డంపింగ్ యార్డ్‌ల నిర్మాణం, సీసీ రోడ్లు, డ్రెయినేజీ, శానిటేషన్, హరితహారం వంటి ఎన్నో పనులు చేపట్టామని తెలిపారు. ఇప్పటికీ తమకు ఒక్కో పంచాయతీలో రూ.5 నుంచి రూ.10 లక్షల దాకా బిల్లులు రావాల్సి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు న్యాయంగా చెల్లించాల్సిన బిల్లులను వెంటనే చెల్లించాలని, లేకుంటే తమకు ఆత్మహత్యే శరణ్యమని వాపోయారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు నిశీథర్‌రెడ్డి, ప్రసాద్‌రావు, నరేష్, చందు, భీక్యానాయక్, విజయ్‌కుమార్, సంతోష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి


డాక్టర్ సుస్మిత

కాళేశ్వరం: ఎండల నేపథ్యంలో వడదెబ్బ, సన్‌స్ట్రోక్‌ల గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుస్మిత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా పొలం పనులకు, ఉపాధిహామీ, వ్యవసాయ రైతులు, కూలీలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉదయం 11గంటలలోపే పనులను ముగించుకొని తిరిగి ఇంటికి చేరుకోవాలన్నారు. తప్పని సరి బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, చేతి రుమాలు, టవల్ లాంటివి తలపైన వేసుకోవాలన్నారు. వేసవి కాలంలో వీలైనంత వరకు తెల్లని కాటన్ దుస్తులను ధరించాలన్నారు. ఎండ తీవ్రతకు నీళ్లు ఎక్కువగా తాగాలి, పని మీద బయటకు వెళ్ళేటప్పుడు వెంట చల్లని నీరు తీసుకొని వెళ్లాలన్నారు. కొబ్బరి బోండాలు, పల్చని మజ్జిగా, నీటిశాతం ఎక్కువగా ఉన్న ఫలాలను, కూరగాయలు తీసుకుకోవాలని తెలిపారు. బయటి తినుబండారాలను తీసుకోకూడదని, డ్రైగా ఉండే ఫ్రై తిండ్లకు దూరంగా ఉంటే మంచిదన్నారు.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బకు గురైన వ్యక్తి అత్యధిక టెంపరేచర్, దాహం, తలనొప్పి, నీరసం, అలసట, వాంతులు, బద్ధకం, వేగవంతమైన హృదయ స్పందన, ఒకానొక సమయంలో స్పృహ కోల్పోవటం, మూర్చపోవడం జరుగుతుందన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని సమయంలో చల్లని ప్రదేశంలో పడుకోపెట్టాలని, గాలి ఆడే విధంగా చూసుకోవాలన్నారు. చల్లని నీటితో తడిపిన గుడ్డలో శరీరం మొత్తం తుడవాలని, ఓఆర్‌ఎస్ ద్రావణం తాగించాలని ఓఆర్‌ఎస్ లేకుంటే చిటికెడు ఉప్పు, తగినంత పంచదార కలిపి తాగించాలని తెలిపారు. అపస్మారక స్థితిలో ఉన్నట్లయితే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలన్నారు.

పోలీసు బలగాల కవాతు



కొత్తపల్లి(ఎస్‌ఎం)లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

భూపాలపల్లి రూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం భూపాలపల్లి మండలంలోని కొత్తపల్లి(ఎస్‌ఎం), మోరంచపల్లి, శ్యాంనగర్ గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నరేష్‌కుమార్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలకు శాంతి భద్రతల సమస్యలు రాకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధమని ప్రతి ఒక్కరూ ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. కవాతులో ఎస్సైలు సుధాకర్, సంధ్యారాణి, సివిల్ పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలు, తదితర పోలీసులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ ఇవ్వకపోవడం సరికాదు


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ములుగు: పార్లమెంటట్ ఎన్నికల్లో మాదిగలకు కాంగ్రెస్ పార్టీ టికెట్లు కేటాయించకపోవడం సరికాదని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు అన్నారు. ఎమ్మార్పీస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గురువారం జిల్లా కేంద్రంలో జాతీయ రహదారిపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా శ్యాంబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎంపీ స్థానాలు 17 ఉండగా ఒక్క సీటు కూడా మాదిగలకు కేటాయించకపోవడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మరాతి రవీందర్, దూడపాక రాజు, వావిలాల సాంబశివరావు, శంకర్, తోకల రాంబాబు, అరవింద్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ


రేగొండ: కారును సోదా చేస్తున్న ఎస్సై ప్రసాద్


టేకుమట్ల: తనిఖీ చేస్తున్న ఎస్సై రవికుమార్

రేగొండ: మండలంలోని రూపిరెడ్డిపల్లి గ్రామంలోని కొప్పుల క్రాస్ వద్ద రేగొండ ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీలను ముమ్మరంగా చేశారు. వాహన పత్రాలను పరిశీలించి వాహనదారుల వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు, వాహనాలను సోదా చేశారు. ఎన్నికల నియామాలను తప్పకుండా పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీలత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టేకుమట్ల: మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఎస్సై ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల పత్రాలను పరిశీలించి, వాహనాలలోని బ్యాగులను సోదా చేశారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి


పరామర్శిస్తున్న జెడ్పీటీసీ గొర్రె సాగర్


పరామర్శిస్తున్న రవీందర్

చిట్యాల: మండలంలోని చింతకుంట రామయ్యపల్లి గ్రామానికి చెందిన జెట్టి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి గురువారం పరామర్శించారు. నాయకులు చింతల రమేష్, లెంకల రాజిరెడ్డి, సదానందం, వెంకట్, రాజు, వేముల శ్రీనివాస్, తీగల బాలకృష్ణ, ఉప్పుల కిరణ్, గురుకుంట్ల కిరణ్, రవీందర్, హరీష్, పాల శంకర్ పాల్గొన్నారు.

జెడ్పీటీసీ సాగర్ పరామర్శ

మండలంలోని జడలపేట గ్రామ శివారులోని గాంధీనగర్‌కు చెందిన బొట్ల రమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను జెడ్పీటీసీ గొర్రె సాగర్ గురువారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట నాయకులు బొమ్మనపెల్లి సమ్మిరెడ్డి, నల్ల దేవేందర్ రెడ్డి, బయగాని గణపతి, సారంగాపాణి, రత్న మొగిలి, మడికోండ రవి, సదయ్య తదితరులు ఉన్నారు.

టేకుమట్ల: మండల కేంద్రానికి చెందిన మియాపురం లక్ష్మీబాయి, భూపతి వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎస్సారెస్పీ మాజీ చైర్మన్ ఆకుల రవీందర్ గురువారం పరామర్శించారు. ఆయన వెంట గుండె ప్రభాకర్, ఖాదర్, వరదచారి, బొడ్డు సరోత్తం రెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

ఆడపిల్లలను చదివించాలి


బారసాల నిర్వహిస్తున్న మహిళలు

శాయంపేట : ఆడపిల్లలు చదివించి ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. మండలంలోని పత్తిపాక అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పోతుగంటి రజనీకర్-కల్పన దంపతుల కుమార్తెకు బారసాల నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గర్భిణులు స్కానింగ్ సెంటర్ల ద్వారా గర్భంలో ఉన్న శిశువు ఆడ, మగ తెలుసుకొని ఆడపిల్ల అయితే అబార్షన్ చేయించుకుంటున్నారని, అది చట్టరీత్యా నేరమన్నారు. ఆడపిల్లలను ఎదగనివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం హేమలత, మహిళా సాధికారిక కేంద్రం అధికారి మానస, అంగన్‌వాడీ టీచర్లు ఆశ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.